కథ

# 'మనసు గతి ఇంతే!'

- ఝాన్సీ కే.వి.కుమారి

**రైలు కూతతో సునీతకు ఒక్కసారిగా మెలకువ వచ్చింది. పై బెర్త్‌మీద పడుకున్న సునీత, బద్ధకంగా కళ్ళు తెరచి, పక్కకు తిరిగి కిటికీలో నుండి దృష్టిసారించింది.**

కొండలను, గుట్టలను, చెట్లను చేమలను దాటుకొంటూ రైలు పరుగెడ్తోంది. అంత వరకూ హాయిగా విశ్రాంతి తీసుకున్న సునీత మనస్సు కూడా రైలుతో పోటీ పడడానికి సమాయత్తమైంది.

నిజానికి సునీత మనస్సు నిద్రపోయేటప్పుడు మాత్రమే విశ్రాంతి తీసుకుంటుంది. మెలకువలో జెట్‌స్పీడుతో పోటీ పడుతూ ఏవేవో లోకాలలో విహరిస్తూ ఉంటుంది.

భర్తతో పాటు హనీమూన్ కావచ్చు, ఫ్రెండ్స్‌తో పిక్నిక్కులు కావచ్చు, కొలీగ్స్‌తో ఆర్గ్యుమెంట్లు కావచ్చు, పుట్టబోయే పిల్లల దగ్గర నుండి సూర్యకుటుంబంలోని ఏదో ఒక గ్రహం మీద ఏడంతస్థుల మేడకట్టుకోవడం వరకూ.... ఏదో ఒకటి నిరంతరం ఆలోచిస్తూనే... చిస్తూనే...స్తూనే ఉంటుంది!

పగలంతా ఎంత ఆలోచించినా రాత్రి హాయిగా నిద్రపట్టేది గనుక సుఖంగా ఉండేది... కొత్త కొత్త ఆలోచనలకు ఊపిరి వచ్చేది. కాని... గత మూడ్రోజులుగా సునీతకు నిద్రపట్టడం మానేసింది.

అల్లంత దూరం నుండి ఊరిస్తోందే గానీ ఆమడ దూరం కూడా చేరువకావడం లేదు. దాంతో కొత్త ఆలోచన లకు తావుదొరకడం లేదు సరికదా, ఒకే ఒక్క ఆలోచన విశ్వరూపాన్ని ప్రదర్శించి, సునీతను భయపెట్టేస్తోంది.

మూడ్రోజులకో ఉత్తరం రాసే మధు, వారం దాటు తున్నా కార్డు ముక్క కూడా రాయలేదేమిటా అనేదే ఆ ఆలోచన!

ఇవ్వాళ, రేపు అంటూ, ఇన్నిరోజులూ ఎదురు చూసి, ఆందోళన క్లయిమాక్స్‌కు చేరుకోగా, ఇక ఆగలేక నాల్రోజులు ఆఫీసుకు సెలవుపెట్టి, విజయవాడ బండెక్కేసింది.

'వెధవుద్యోగం... ఐనవాళ్ళకూ, కట్టుకున్నవాడికి దూరంగా ఎక్కడో' అపరిచితుల మధ్య బ్రతుకుతెరువు చూసుకోవడం, రెండు నెల్లకోసారి అతికష్టం మీద సెలవు సంపాదించి చుట్టపు చూపులాగా, సొంతింటి కెళ్ళిరావాల్సి రావడం... ప్చ్.. నేటి నవనాగరిక సమాజం స్త్రీ కిచ్చిన బహుమానం!

గలివర్ యాత్రకు మించిన సాహస యాత్ర కదూ... నేటి మహిళ చేస్తున్నదీ! అక్కడ లిల్లీపుట్లు కళ్ళకు కన్పించే చిన్నసైజులో ఉన్నారు.... కానీ, నేటి సమాజంలో ఆకారానికీ, సైజుకీ, షేపుకీ మనుషుల్లానే కన్పిస్తూ, మనస్సుల్లో మాత్రం లిల్లీపుట్లుగా, పాములుగా, నక్కలుగా కొండొ కచో సకల దుష్ట మృగముల సమ్మేళనంగా ఉంటారు.

ఇలాంటి వాళ్ళ మధ్య తల్లి నీడ నుండి తప్పిపోయిన లేడిపిల్లలా బెదురు బ్రతుకు బతకాల్సి వస్తోంది.

వెధవుద్యోగం... మనస్ఫూర్తిగా చెయ్యనూలేదు... తెగించి రాజీనామా ఇవ్వనూ లేదు!

ట్రాన్స్‌ఫర్ వస్తుంది... అదిగో... ఇదిగో.... అంటూ ఎండమావిలా చూపిస్తున్నారు. నూటా డెబ్బై మూడో సారి తిట్టుకుంటూ, టైం చూసుకుంది సునీత.

హమ్మయ్య.... ఇంకొక్క గంటలో విజయవాడ ప్లాట్‌ఫారం మీద, తర్వాత అరగంటలో శ్రీవారి సన్నిధిలో! సడన్ సర్‌ప్రైజిద్దామని ఉత్తరం రాయలేదు.... అయినా రాసే టైమేది... అనుకోకుండా బయల్దేరితే!

ఛ...ఛ... వెధవ సర్‌ప్రైజ్... టెలిగ్రామిచ్చినా బాగుండేది... స్టేషన్లోనే ఆయనను చూసుకునేది! ఛ... తనకసలు బుద్ధిలేదు. చేసేవన్నీ ఇలాంటి తెలివి తక్కువ పన్లే!

'ఒకవేళ... ఆయన... స్టేషన్‌కొస్తే...?!' ఆశపడింది సునీత.

'పన్లేక వస్తారా? ఆయనేమైనా కలగన్నారా నువ్వొస్తున్నావని?' బండ గంతుతో వెక్కిరించింది అంతరాత్మ!

'పోనీ.... ఇంట్లోనైనా ఉంటారా? ఒకవేళ... ఆఫీసుకెళ్ళిపోతే?' భయమేసింది సునీతకు.

'ఛ... ఛ... తనంత ఫూల్ ఈ భూగ్రహంపైనే కాదు, మరే గ్రహంపైనా ఉండదు!' అరవైయ్యవ సారి అనుమానానికి ఆస్కారమేలేని స్టేట్‌మెంటిచ్చేసింది.

అంతరాత్మ చప్పట్లు కొడుతూంటే 'సరేలే.... ఎలాగో ఒకలా జరుగుతుందిలే' అనుకొని నీర్సంగా బెర్త్‌పై నుండి కిందికి దిగింది.

లగేజంతా ఒకసారి చెక్‌చేసుకుని, పక్కావిడతో చెప్పి టాయ్‌లెట్‌వైపు వెళ్ళింది.

మళ్ళీ ఆలోచనలు... క్షణం ఖాళీ దొరికితే చాలు... బుర్రను ఆలోచనలు ముసురుకుంటాయ్... ఎందుకూ పనికిరానివి... పైగా మనస్సుని చిరాకు పర్చేవి, మొన్నామధ్య శిరీష... అదే తన కొలీగ్ పిలిస్తే వాళ్ళింటికెళ్ళింది.

మాటల్లో వాళ్ళ బామ్మగారు ఒక బాంబు వేసింది... చూస్కో... అది ఎక్కడ, ఎలా పేలాలో అలాపేలిపోయింది... నాటి నుండి దాని తాలూకు శకలాలు క్షణక్షణం గుండెను శూలాల్లా పొడుస్తున్నాయ్.

"ఈ వయస్సులో ఆలుమగలు దూర దూరంగా ఉంటే ఎలాగమ్మాయ్...?

ఉద్యోగాలనీ, చదువులనీ ఇవ్వాళ, రేపు ఆడపిల్లలు మొగుణ్ణిడిచిపెట్టి తిరుగుతున్నారు గానీ,

మాకాలంలో మేమెరగమే తల్లీ... వీళ్ళ తాతగారు నా కొంగు విడిచేవారే కాదు... రెండు నిమిషాలు కనబడకపోతే ఉక్కిరిబిక్కిరయ్యే వారు.. వయస్సులో ఉన్న మగాళ్ళా... పక్కన పెళ్ళాం లేకపోతే..." అంటూ టీకా తాత్పర్యాలతో దీర్ఘాలూ, రాగాలూ తీసి, సునీత ప్రశాంతమైన మనస్సులో ఓ బండరాయిని వేసింది... అంతే ఆ సుడులు ఇప్పట్లో ఆగేలా లేవు!

'ఛీ... ఆయన అందరిలాంటి వారు కారు... ఎంతో ఉన్నతమైన ఆశయాలూ, ఆదర్శాలు గలవారు... ఆయనలో ఇలాంటి బలహీనతలకు చోటులేదు....

"ఏమో... ఆయనా మగవాడేగా... తానూ మగాడు గనుకనే, మగాడి బలహీనతల్ని పుణికి పుచ్చుకున్నవాడు గనుకనే ఇంద్రుడు విశ్వామిత్రుడి మీదకు మేనకను ఉసిగొల్పి, వ్రతభంగం కావించి, మగవాడికి చక్కని నిర్వచనాన్నిచ్చాడు!

## హాబీ


పేషంట్ అడిగాడు డాక్టర్ని.

"డాక్టర్ మీకు ఫొటోలు తీయడం హాబీ కదూ"

"అవును... ఎలా కనుక్కొన్నారు."

"ఇంజక్షన్ చేస్తున్నప్పుడు 'స్మైల్ ప్లీజ్' అనడాన్ని బట్టి."

-కె.వి.మధుసూదనరావు,కాకినాడ.



ఔనూ... అన్నట్టు... ఈ మధ్య వాళ్ళ మేనత్తకూతురు వచ్చిందని లెటరు రాసారుగా. ఎన్ని రోజులుందో ఏమో... ఆ అమ్మాయికి ఈయనగారంటే చాలా ఇష్టమట కూడానూ.

చేసుకుంటే నీలాంటివాణ్ణే చేసుకుంటా బావా...?

నీలాంటి వాణ్ణే ఎందుకు... అసలు నన్నే చేసుకుంటే పోలా'

'ఏమిటి చేసుకునేదీ.... పిడకలా' అని ఈయన కాలేజీ చదువుకునే రోజుల్లో ఉత్తరాలు రాసేదట...

మరైతే వాళ్ళు చేస్కోవచ్చుకదా... నన్నెందుకు కట్టుకున్నట్టు ఛీ... ఒకరంటే ఒకరికిష్టం..బోలెడంత ఏకాంతం... ఎంచక్కా సినిమాలూ, షికార్లూ.. ఒకటేమిటి... పెళ్ళయిన మగాడితో తిరగడానికి సిగ్గూ, అభిమానం ఉండొద్దూ...

అందుకే స్త్రీకి స్త్రీయే శత్రువంటారు... అయినా ఆ పిల్లనెందుకు ఆడిపోస్కోడం... మన నునిషికుండొద్దూ బుద్ధి? ఛి...ఛీ... మన బంగారం మంచిదైతే...

ఆలోచనలతోనే మొహం కడుక్కొని, తల దువ్వుకుని, తన సీటు దగ్గరకొచ్చింది సునీత, తన సీట్లో కూర్చున్న బామ్మగారు, తనను చూసి పక్కకు జరిగింది.

లగేజీని మరోసారి చెక్ చేసుకుని టైం చూసుకుంది సునీత. ఇంకో పదినిమిషాల్లో బండి విజయవాడ ఫ్లాట్‌ఫారం మీద ఆగుతుంది.

"ఎక్కడ నుండి వస్తున్నావమ్మా?" బామ్మగారి పలకరింపు

## చిన్న విమానం

రష్యాలోని ఫ్రంజ్ నగరానికి చెందిన 'విక్టర్ డామినో' అనే ఇంజనీరు ప్రపంచంలో అతి చిన్న విమానం తయారుచేశాడు. దీని స్పీడ్ గంటకు 42 కి.మీ. నుండి 130 కి.మీ. బరువు కేవలం 47 కి.గ్రా.

" కాకినాడ నుండండి" వినయంగా సమాధాన మిచ్చింది సునీత.

"చదువుకొంటున్నావా?"

"లేదండి... ఉద్యోగం చేస్తున్నా"

'ఇంకా పెళ్ళి కాలేదేమో' తనలో తాను అనుకొంటు న్నట్టుగా అంది తలనెరిసిన బామ్మ.

"పెళ్లయిందండీ... మావారు విజయవాడలో ఉద్యోగం చేస్తున్నారు. నేనిప్పుడక్కడికే వెళ్తున్నాను సెలవు తీసుకుని" టకటకా చెప్పేసింది ఆవిడ అడగ బోయే ప్రశ్నలన్నింటిని ఊహించిన సునీత!

"అయ్యో నా తల్లీ, వయసు పిల్లలు కలిసి మెలిసి, చిలకా గోరింకల్లా ఉండాల్సిన రోజుల్లో, ఉత్తర ధృవాన ఒకరు, దక్షిణ ధృవాన ఒకరు ఏవిటమ్మా... చుట్టం లాగ వెళ్తున్నావా నెలకోసారి?!'

తన అంతులేని ఆశ్చర్యాన్నీ, ఆవేదననూ, సంతాపాన్నీ ప్రకటించింది డెబ్భైఏళ్ళ బామ్మ లోతుకుపోయిన బుగ్గల్ని ఇంకా నొక్కుకుంటూ.

మూల్గుతున్న నక్కమీద తాటికాయపడ్డట్టు, ఆ దెబ్బ తగలాల్సిన చోటే తగిలింది సునీతకు!

కూతవేస్తూ ఆగిపోయింది విజయవాడ ప్లాట్ ఫారం మీద రైలు. తనకోసం ఎవ్వరూ రారని తెలిసికూడా ఆశగా చూసిందిజ

' ఏ గర్ల్‌ఫ్రెండునైనా రిసీవ్ చేస్కోడానికి గానీ, సెండాఫ్ ఇవ్వడానికి గాని వచ్చారేమో!' 'గుండెను పిండేసినట్టుగా ఉంది వెధవ తలంపు...ఛీ...'

"అమ్మా... కూలీ" లగేజంతా ఆతనికి ఎత్తి, బామ్మగారికి చెప్పి, హేండ్ బ్యాగ్‌తో కూలీని అనుసరించింది సునీత.

స్టేషన్నుండి బయటపడి, ఆటో ఎక్కి కూర్చున్న సునీత 'హమ్మయ్య' అనుకుందో లేదో, పిలవాపెట్టని పేరంటాల్లా వచ్చి ముసురుకున్నాయ్ ఆలోచనలు...

'నే వెళ్ళేప్పటికి ఈయనుంటారా ఇంట్లో... బయటికెక్కడికైనా వెళ్తే... ఏమో... మేనత్త కూతుర్ని తెచ్చుకుని ఏకంగా ఇంట్లోనే పెట్టుకున్నారేమో... సరస సల్లాపాలలో తేలుతూ ఉండొచ్చు... సడెన్‌గా నన్ను చూస్తే... ఛీ... ఏమిటే... ఇంత బలహీనురాలనై పోతున్నావేంటి... అందుకే చెప్పారు మాటలు వినకు చెడతావూ అంటారు పెద్దలు... అవన్నీ వినడం వల్లనే కదా తనకీ చెత్త ఆలోచనలు...'

"అమ్మా.. సూర్యారావుపేట... ఎక్కడ ఆప మంటారు...?" ఆటో అతని మాటలతో ప్రస్తుతంలోకి వచ్చింది సునీత.

కంగారుగా రోడ్డు కటూ, ఇటూ చూసి, తమ ఇల్లు దాటుకొని ఆటోవెళ్తోందని గమనించి "బాబూ... నేను చూడలేదు... అదిగో ఆ సందులోకి వెళ్ళాలి... వెనక్కి తిప్పు..." బ్రతిమాలింది.

అతగాడు ఒక క్షణం ఆమె మొహంలోకి ఎగాదిగా చూసి, వెనక్కి తిప్పాడు. సునీత గుండె వేగం హెచ్చింది...

రెండు నిమిషాల్లో ఇంటిముందాగింది ఆటో. లగేజి లోపలికి తెమ్మని ఆటో అతనికి చెప్పి, గేటు తీసుకుని లోపలికి అడుగుపెట్టింది సునీత.

"అరె... సునీతా... బాగున్నావామ్మ... ఇదేనా రావడం..." ఆప్యాయంగా పలకరించింద ఇంటావిడ.

"అవునాంటీ... బాగున్నారా..." అంటూ తమ పోర్షన్‌లోకి వెళ్ళబోతుంటే మరలా ఆవిడే అంది "అబ్బాయి లేడమ్మా... నిన్నటి నుండీ గదికి తాళం వేసి ఉంది."

పక్కనే బాంబుపేలినట్టు అదిరిపోయింది సునీత!

"నువ్వొస్తున్నట్టు ఉత్తరం రాయలేదా అమ్మా... పోనీ ఫోనన్నా చేయకపోయావా?"

"లేదాంటీ... అనుకోకుండా బయల్దేరాను..." నీర్సంగా ఉంది ఆమె కంఠం.

లగేజి లోపలపెట్టిన ఆటో అతను డబ్బులకోసం నిలబడ్డాడు. సునీతకు మెరుపులాంటి ఆలోచనతో పాటు, ఉత్సాహం కూడా కల్గింది.

"ఆంటీ... కాస్త ఈ సామాను మీ ఇంట్లో ఉంచండి. వాళ్ళాఫీసుకెళ్ళి విషయం కనుక్కొస్తాన"ని చెప్పి, గబ గబా వెళ్ళి ఆటోలో కూర్చుని, LIC ఆఫీసుకు పోనీయమంది.

ఆటో స్పీడు నందుకోక మునుపే సునీత ఆలోచనలు విపరీతమైన స్పీడులో పరుగెత్తు తున్నాయ్... సాయంత్రం ఆరు గంటలకు విజయవాడ బీసెంటు రోడ్డులో ట్రాఫిక్కు ఎలా ఉంటుందో అలా ఉంది సునీత మనస్సు... కంగారుగా, గందరగోళంగా! అదుపు తప్పి ఆవేశపడుతున్న మనస్సును నూటా డెబ్బై ఏడుసార్లు తిట్టుకుంటూ... ఒకవేళ... కొంపతీసి ఈయన అటు కాకినాడ బండెక్కేయలేదు కదా...

"అమ్మా..ఎల్ఐసి ఆఫీసుకొచ్చేశాం" ఆటో అతనికి తనవాలకం అర్థమైపోయినట్టుంది.




బి.ఉమాభాస్కర్, ది.ఎన్.ఎఫ్.సి.స్టోర్స్, ఎల్.పి.జి.వింగ్, శక్కర్‌నగర్, బోధన్-503 180.

ఆటో దిగి లోపలికి వెళ్ళింది. ఎదురైన అటెండర్ని అడిగింది "బాబూ, మధుగారున్నారా?" అని, తనను గుర్తుపట్టిన అతను "నమస్కారమమ్మా... అయ్యగారు నాలుగు రోజులు సెలవు పెట్టారమ్మా..." ఒక్క క్షణం సునీతకు బుర్ర పనిచేయడం మానేసింది... కింకర్తవ్యం?

"నమస్కారమండీ... ఏమిటి... మీకప్పుడే టెలిగ్రాం అందదే... ఈ సారికి అందితే మీరు ట్రెయిను పట్టుకుని రేపీపాటికి రావచ్చనుకొంటున్నాం... అప్పుడే రావడం... ఎలా సాధ్యం...?" ఆశ్చర్యంగా అతనంటుంటే, అంతకంటే ఆశ్చర్యంగా అతని మొహంలోకి చూస్తూ నిలబడిపోయింది.

"నాకు తెలుసు... మీకు టెలిగ్రాం అందలేదు. టెలీపతి వల్ల మీరు వచ్చేశారు. వారు టీవీఎస్ నర్సింగ్ హోంలో ఉన్నారు. మీరు ఆటోలో పదండి... నేను స్కూటరు మీద వస్తాను. బాబూ...టీవిఎస్" కి పదవోయ్ అతనంటుంటే, "ఇంతకీ ఆయనకే మైందండీ" కంగారుగా అడిగింది సునీత.

"ఆ... ఏం లేదు... మీమీద దిగులు... కొద్దిగా జ్వరం... నీర్సంగా ఉన్నాడని గ్లూకోజ్ ఎక్కించాం"

అప్పటికే ఉబికివస్తున్న కన్నీటిని తుడుచుకుని, ఆటో ఎక్కి కూర్చుంది సునీత.

'ఛ... తనెంత నీచంగా ఆలోచించింది... ఆయన జ్వరంతో మంచానపడి హాస్పిటల్ పాలైతే, తన ఊహలు ఎక్కడెక్కడికో తీసుకుపోయాయ్... అరె... పూర్ణచంద్రరావు గార్కి థాంక్సైనా చెప్పలేదు....' ఇప్పుడు కళ్ళు రోడ్డును చూస్తున్నాయ్... దాటిపోతున్న బోర్డులను చకచకా చదివేస్తున్నాయ్...

"ఆ... ఆ...అదిగో టీవిఎస్ నర్సింగ్ హోమ్..." కంగారుగా అరిచేసింది.

"నాకు తెల్సు కదమ్మా... ఆపుతున్నాను" నవ్వుతూ గేటులోపల ఆపేడు ఆటోను డ్రైవర్.

మీటరు 14-70 చూపుతోంది. ఇరవై రూపాలయ నోటు అతని చేతిలోపెట్టి, చిల్లర కూడా తీస్కోకుండా లోపలకు పరుగెత్తింది... "థాంక్స్ బాబూ' అంటూ.

"పాపం... కొత్తగా పెళ్ళయిందనుకుంటా" ఆటో అతను నవ్వుతూ ఆటోను స్టార్ట్ చేశాడు.

ఎదురైన డాక్టరును పడేయబోయి తానూ పడబోయి, నిలదొక్కుకుని 'సారీ' చెప్పి వెనకవస్తోన్న సిస్టరుకు వివరాలు చెప్పి, ఆమె వెనకే నడిచింది. అదే వరండాలో చివరన ఉన్న స్పెషల్ రూం తలుపు మీద, చిన్నగా 'నాక్' చేసి తలుపుతెరచి, సిస్టర్ వెళ్ళిపోయింది.

లోపల బెడ్మీద మెడ వరకు దుప్పటి కప్పుకొని, కళ్ళు మూసుకుని పడుకొని ఉన్న మధును చూడగానే దుఃఖం ఆగలేదు సునీతకు.

తలుపు చప్పుడుకు నెమ్మదిగా కళ్ళు తెరిచాడు మధు... గుమ్మంలో సునీత! (7)

కలా... నిజమా... ఆనందంతో కళ్ళు మెరుస్తుం డగా, చేతులు చాచాడు. ఒక్క పరుగున వెళ్ళి అతని గుండెల మీద వాలిపోయింది సునీత!


-ఝాన్సీ కే.వి.కుమారి
ఆలిండియా రేడియో
నిజామాబాద్ - 503 001.


## నిప్పులేనిదే....



జూహీ చావ్లా - జై మెహతాల ప్రేమాయణం గురించి ఈ మధ్య తెగ వినిపిస్తోంది. 'అబ్బే అలాంటిదేంలేదు' అని జూహీ అంటున్నా నిప్పులేనిదే పొగరాదు కదా అంటున్నారు సినీ జనాలు. నిజమే!

ఇటీవల జై-జూహీ కలిసి షిరిడీకి వెళ్ళడం పలువురు సినీ ప్రముఖుల దృష్టిలోకి వచ్చింది. అందుకనే వీరి పెళ్ళి అతి తొందర్లో జరిగిపోతుందేమోనని జోస్యాలు చెబుతున్నారు.

ఏదేమైనప్పటికి జూహీ సాగిస్తున్నదంటున్న ఈ ప్రేమాయణం చూస్తుంటే నిజమేనేమో అనిపించకమానదు.

-మౌర్య.




వడ్డెపల్లి రమేష్, ఇ.నం.1-110, గ్రామంఃటంగుటూరు, మండలంఃఆలేరు, జిల్లాఃనల్గొండ-508 16